క్లుప్తంగా

డ్రైనేజీ పనులు త్వరగా పూర్తిచేయండి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: రహదారిపై చేపట్టిన డ్రైనేజీ మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తలకొండపల్లి కూడలిలో కొనసాగుతున్న సైడ్ డ్రైన్ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పనులు నాణ్యతాప్రమాణాలతో చేపట్టాలని ప్రాజెక్ట్ డిప్యూటీ మేనేజర్ భరద్వాజ్‌కు సూచించారు. బీఆర్ఎస్ రావిచేడ్ గ్రామ అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, నాయకులు అశోక్, వెంకటేశ్, జంగయ్య తదితరులు ఉన్నారు.

గిరిజన సేవా సంఘం నాయకుడు మృతి

నివాళి అర్పించిన నేతలు



మోత్యానాయక్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

కడ్తాల్: మాజీ ఎంపీపీ కమ్లీ భర్త, గిరిజన సేవా సంఘం రాష్ట్ర నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవవత్ మోత్యానాయక్(47) అనారోగ్యంతో శనివారం చనిపోయారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.. మైసిగండిలోని మోత్యానాయక్ పార్థివదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పీసీసీ సభ్యుడు బాలాజీసింగ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా భగత్ సింగ్ జయంతి



భగత్ సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

మంచాల: భగత్ సింగ్ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శనివారం మండల పరిధి ఆరుట్ల గ్రామంలో ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు ఎల్లేష్, బుచ్చయ్య, భాషయ్య, ప్రసాద్, జంగయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయిలో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విజేతలు

ఆమనగల్లు: జోనల్‌స్థాయి క్రీడా పోటీల్లో ఆమనగల్లు విద్యార్థులు సత్తాచాటారు. తలకొండపల్లి మండల కేంద్రంలో రెండు రోజుల పాటు ఎస్‌జీఎఫ్ జోనల్‌స్థాయి వాలీబాల్ టోర్నీని నిర్వహించారు. ఈ పోటీల్లో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల విద్యార్థులు పాల్గొనగా.. పట్టణానికి చెందిన వివేక విద్యాభారతి విద్యార్థులు విజేతగా నిలిచి, ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. బాలికల విభాగంలో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో వివేక విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా.. తలకొండపల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బాలికలను పాఠశాల ప్రిన్సిపాల్ మహమూద్, కరస్పాండెంట్ గోలి శ్రీనివాస్ అభినందించారు.

సమాజ్‌వాదీ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా మహేందర్

కందుకూరు: సమాజ్‌వాదీ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా గూడూరుకు చెందిన కానపురం మహేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటికెల శ్రీహరి చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు.

ఓటరు తుదిజాబితా సిద్ధం



ఇబ్రహీంపట్నం: ఎంపీడీఓ నోటీస్ బోర్డుపై ఓటర్ లిస్టు



యాచారం: ఎంపీడీఓ కార్యాలయంలో



మంచాలలో..

- మండలాల వారీగా ఫైనల్ లిస్ట్
- ఎంపీడీఓ, జీపీ కేంద్రాల్లో ప్రదర్శన

ఇబ్రహీంపట్నం: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముమ్మరంగా కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా శనివారం రాష్ట్ర ఎన్నికల సంఘంగా ముసాయిదా ఓటరు తుది జాబితాను విడుదల చేయగా.. సంబంధిత అధికారులు మండల పరిషత్, గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రజలకు అందుబాటులో ఉంచారు. జెడ్పీ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి సమక్షంలో ఇబ్రహీంపట్నం మండల పరిషత్ నోటీస్ బోర్డుపై ఎంపీడీఓ వెంకటమ్మ, సూపరింటెండెంట్ జంగయ్యలు మండల పరిధి 14 గ్రామాల ఓటర్ల తుది జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచారు. మండలంలో 30,938 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 15,378, మహిళలు 15,558 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు.

యాచారంలో..

యాచారం: ఓటరు తుది జాబితాను ఎంపీడీఓ కార్యాలయం నోటీసు బోర్డుపై ఎంపీడీఓ నరేందర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి శ్రీలతలు ప్రజలకు అందుబాటులో ఉంచారు. మండల పరిధి 24 గ్రామాల్లో మొత్తం 48,495 ఓటర్లు ఉన్నారు.

మంచాలలో..

మంచాల: మండల పరిధి 23 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటరు తుది జాబితాను అన్ని గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉంచామని ఎంపీడీఓ బాల శంకర్ తెలిపారు. మండల స్థాయిలో ఎంపీడీఓ కార్యాలయంలో లిస్టును ప్రజలకు అందుబాటులో ఉంచామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉమారాణి, పంచాయతీరాజ్ శాఖ ఏఈ మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి తొలి ప్రాధాన్యత



స్వచ్ఛత హి సేవలో చైర్ పర్సన్ తదితరులు

చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ

తుర్కయంజాల్: పారిశుద్ధ్య కార్యక్రమాలకు తొలి ప్రాధాన్యత ఇస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. శనివారం తొర్రూర్‌లోని ఫంక్షన్ హాల్‌లో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సంబంధిత అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఇంటింటి చెత్త సేకరణ, చెత్త ప్రాసెసింగ్ చేసే విధానం, చెత్తను సరైన పద్ధతిలో తొలగింపు, వేరు చేయడం, బతుకమ్మ పండుగకు తీసుకోవాల్సిన ఏర్పాట్లు, అంగన్‌వాడీల మరమ్మతు, కొత్త కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రస్తావించారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని అనురాధ ప్రారంభించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. స్వచ్ఛత హి సేవలో పాల్గొన్న సిబ్బందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత, కమిషనర్ అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు కుంట ఉదయశ్రీ, మర్రి మాధవి, కొత్తకుర్మ మంగమ్మ, నక్క శివలింగం గౌడ్, బొక్క శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతుసేవా సహకార సంఘంలో సోమవారం 55వ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం మేనేజర్ ఐలేష్ యాదవ్ తెలిపారు. సంఘం కార్యాలయంలో చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అధ్యక్షతన ఉదయం 11.30 గంటలకు చేపట్టే సమీక్షకు సంఘం డైరక్టర్లు, సభ్యులు, రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోండి

తలకొండపల్లి: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. శనివారం మండల పరిధి కోరింతకుంటతండాలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆయన వైద్య శిబిరం ప్రారంభించారు. వైద్యులు అఖిల్, అనిల్ నేతృత్వంలో, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో 155 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రవి నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంజయ్య, గౌడ సంఘం తాలూకా కన్వీనర్ అశోక్ గౌడ్, పట్టు రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శక్రు నాయక్, బాలు, నరేష్, బిక్యనాయక్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

తుక్కుగూడ: జిన్నాయిగూడ లక్ష్మీనర్సింహస్వామి, ఈ–సిటీ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగేల హేమలత రాజుగౌడ్ అన్నారు. శనివారం ఈ రెండు ఆలయాల్లో ఆమె ప్రత్యేక పూజలు చేశారు.

మొక్కలు నాటిన కమిషనర్



మొక్కనాటి నీరు పోస్తున్న కమిషనర్

ఆమనగల్లు: స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు చోట్ల కమిషనర్, సిబ్బంది మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో పుర సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటం

బీసీ మహాధర్నాలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



మహాధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

ఆమనగల్లు/కడ్తాల్/మాడ్గుల: సంఘటిత ఉద్యమాలతోనే బీసీలకు రాజ్యాధికారం వస్తుందని, ఆ దిశగా పోరాటం చేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (నవీన్ కుమార్) పిలుపునిచ్చారు. వచ్చేది బీసీల రాజ్యమేనన్నారు. శనివారం కల్వకుర్తిలో నిర్వహించిన బీసీ మహాధర్నాలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ల సాధన కోసం రాజకీయాలకు అతీతంగా కలిసిరావాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, బీసీ రాష్ట్ర నాయకులు రవికుమార్, ఉష, రాజేందర్, వెంకటయ్య యాదవ్, సదానందంగౌడ్, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి ఘన స్వాగతం

బీసీ మహాధర్నాకు వెళ్తున్న క్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కడ్తాల్ మండల కేంద్రం, మాడ్గుల మండలం ఇర్విన్‌లో ఆగగా.. ఆయనకు స్థానిక నాయకులు ఘనం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కడ్తాలలో.. అంబేద్కర్, జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు స్థానిక నాయకులతో కలిసి నివాళులర్పించారు. మాడ్గులలో.. ఇర్విన్ మండల ఏర్పాటు విషయం గురించి ఇర్విన్ గ్రామస్తులు.. ఎమ్మెల్సీకి వివరించగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

బతుకమ్మ సంబురాలు



సరస్వతి శిశుమందిర్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థినులు

ఆమనగల్లు: బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. సెలవుల నేపథ్యంలో ముందస్తుగా.. శనివారం పట్టణంలోని సరస్వతి శిశుమందిర్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, ఆడి పాడారు. అనంతరం స్థానిక సురసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు.

కన్నవారికి తీరని శోకం



బాలకృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

కానిస్టేబుల్ మృతితో మంచాలలో విషాద ఛాయలు

మంచాల: ఆర్థిక ఇబ్బందులతో ఏఆర్ కానిస్టేబుల్ బాలకృష్ణ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కలెక్టరేట్‌లో విధి నిర్వహణలో ఉండగానే గన్‌తో కాల్చుకొని విగతజీవిగా మారాడు. దీంతో బాలకృష్ణ స్వగ్రామం మంచాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. దూసరి సత్తయ్య–జయమ్మ దంపతులకు బాలకష్ణతో పాటు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఆడపిల్లల వివాహం చేశారు. బాలకష్ణ అవివాహితుడు. బాలకృష్ణ చిన్ననాటి నుంచే చురుగ్గా ఉండేవాడు. విద్యార్థి (ఎస్ఎఫ్ఐ) సంఘంలో పనిచేస్తూ మండల కార్యదర్శి స్థాయికి ఎదిగాడు. చదువుతో పాటు విద్యార్థుల సమస్యలపై అనేక ఉద్యమాలు చేశాడు. ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. అంతా బాగుందనుకున్న క్రమంలో ఆత్మహత్యకు పాల్పడి తల్లిదండ్రులకు, తోబుట్టువులకు తీరని శోకం మిగిల్చాడు. 'వృద్ధాప్యంలో అండగా ఉంటాడని ఆశతో జీవిస్తున్న మాకు ఏ దిక్కు లేకుండా పోయిందని' బాలకృష్ణ తల్లిదండ్రులు రోదించడం.. పలువురిని కంటతడి పెట్టించింది. ఒక్కగానొక్క కొడుకును ఎంతో గారాబంగా పెంచామని, పెళ్లి చేసి ఓ ఇంటివాడిని చేద్దామని ఆశపడ్డామని, చివరకు కడుపుకోతను మిగిల్చాడని వారు కన్నీటి పర్యంతం అయ్యారు. బాలకృష్ణ మృత దేహానికి పలువురు నివాళి అర్పించారు.

పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి

డాక్టర్ సైదమ్మ



రాంపూర్ వైద్య శిబిరంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తలకొండపల్లి: పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని డాక్టర్ సైదమ్మ అన్నారు. శనివారం మండల పరిధి రాంపూర్, జంగారెడ్డిపల్లి, మెదక్‌పల్లి గ్రామాల్లో, గట్టు ఇప్పలపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించి, అవగాహన కల్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు అవసరమైన వైద్య ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

పొగతాగడం గుండెకు చేటు

ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా డాక్టర్ సైదమ్మ హృదయ సంబంధిత వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. మనం తీసుకునే ఆహారం, రక్తపోటు, వాయు కాలుష్యం, హై కొలస్ట్రాల్, పొగతాగడం కారణంగా గుండె జబ్బులు వస్తాయని పేర్కొన్నారు. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే జీవనశైలిని మార్చుకోవాలని సూచించారు. నిత్యం వ్యాయామం చేయడంతో పాటు, గంట పాటు నడక, 8 గంటలు తక్కువ కాకుండా నిద్రపోవడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, శుభ్రమైన ఆహారం, నీటిని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ ఆంజనేయులు, హెచ్ఏ మల్లయ్య, ఏఎన్ఎంలు, ఆశలు రేవతి, జంగమ్మ, కార్యదర్శులు రమేష్ నాయక్, లింగారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి



ఆన్‌లైన్‌లో సభ్యత్వాలు నమోదు చేయిస్తున్న నాయకులు

తలకొండపల్లి: బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ అనిల్ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ సభ్యత్వ నమోదు చేయిస్తూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు యువత ఆకర్షితులై పార్టీలో సభ్యత్వం పొందుతున్నారని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అమలు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిందని, హామీలను నెరవేర్చేవరకు ప్రజలతో కలిసి పోరాడతామన్నారు. మండలంలో 202 సభ్యత్వాలు నమోదు చేయించినట్లు చెప్పారు.

బాలసభ.. బాలికల ప్రతిభ



ఆమనగల్లు: సభ వేదికగా పాటలు పాడుతున్న విద్యార్థినులు



బాలసభలో మాట్లాడుతున్న విద్యార్థినులు

ఆమనగల్లు: బాలసభ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. విద్యార్థులే సభ నిర్వాహకులుగా వ్యవహరిస్తూ అలరిస్తున్నారు. తోటి విద్యార్థులతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ అబ్బురపరుస్తున్నారు. ప్రతి వారం ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షరజ్యోతి సహకారంతో సభ నిర్వహించారు. ఇందులో విద్యార్థులు కథలు, పొడుపు కథలను వినిపించారు. ఆటపాటలతో అలరించారు. విద్యాధికారులుగా వ్యవహరిస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి పద్మజ్యోతి, ఉపాధ్యాయులు సరిత, ధనలక్ష్మి, పార్వతి, వసంత, ఫౌండేషన్ వలంటీర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యాధికారులుగా..

మాడ్గుల: కసూర్బాగాంధీ విద్యాలయంలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలసభ ఆకట్టుకుంది. ప్రతి శనివారం పాఠశాలలో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా, బాలసభ వేదికగా విద్యార్థులు.. డీఈఓ, ఎంఈఓ, ఎస్ఓగా వ్యవహరించారు. కథలు చెప్పారు. నృత్యంతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎస్ఓ రేఖ అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు విజయ్, ఉపాధ్యాయులు, అక్షర జ్యోతి కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

కందుకూరు: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని హెచ్ఎం దేవేందర్ అన్నారు. మండల పరిధిలోని రాచులూరు జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా హెచ్ఎం ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి గ్రామంలో సేకరించే ఆటో లేదా ట్రాక్టర్‌కు అందించడం తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.సెల్వమణి, ఉపాధ్యాయులు రాజు, నర్సింహా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీమార్గం.. సత్వర న్యాయం

- లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి
- ఇబ్రహీంపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, ఆమనగల్లు జడ్జి స్వరూప



ఆమనగల్లు: లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వరూప



ఇబ్రహీంపట్నంలో.. మాట్లాడుతున్న జడ్జి శ్రీదేవి

ఇబ్రహీంపట్నం: రాజీ మార్గంతోనే కక్షిదారులు సత్వర న్యాయం పొందవచ్చని ఇబ్రహీంపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి అన్నారు. పట్నం న్యాయస్థానంలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో రెండు నెలలకు ఒకసారి లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. క్షణికావేశంలో చోటుచేసుకున్న వివాదాలు, తప్పిదాలతో పట్టింపులకు పోయి కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బును, సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. అలాంటి కేసులను లోక్ అదాలత్‌లో సులువుగా పరిష్కరించుకోవచ్చునని పేర్కొన్నారు. ఆదిబట్ల, పట్నం, మంచాల, యాచారం, గ్రీన్ ఫార్మా పోలీస్‌స్టేషన్ పరిధి 556 కేసులను ప్రస్తుత లోక్ అదాలత్‌లో పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి యశ్వంత్‌సింగ్, అదనపు జూనియర్ జడ్జి హిమబిందు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్, అదాలత్ సభ్యులు వెంకటేశ్, సాయికుమార్, న్యాయవాదులు రమేష్, ధనుంజయ, జక్కుల జగన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

153 కేసుల పరిష్కారం

ఆమనగల్లు: ఇరువర్గాలు రాజీపడి కేసులను పరిష్కరించుకోవాలని ఆమనగల్లు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కాటం స్వరూప అన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని ప్రథమ శ్రేణి న్యాయస్థానంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల్, తలకొండపల్లి మండలాల ఠాణాల పరిధి 153 కేసులు పరిష్కారం అయ్యాయని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐలు ప్రమోద్‌కుమార్, జగదీశ్, శివప్రసాద్, ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్, ఎస్ఐలు వెంకటేశ్, వరప్రసాద్, శ్రీకాంత్, కోర్టు ఏపీపీ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.